క్లుప్తంగా

అంబులెన్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన 108 అంబులెన్స్ వాహనాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీకు మంజూరైన 108 వాహనాన్ని ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ..ఏజెన్సీ ప్రాంతమైన అశ్వారావుపేట మండలానికి గత కొన్నేళ్లుగా 108 వాహనం లేకపోవడంతో అత్యవసర వేళలో స్థానికులు ఆస్పత్రులకు చేరుకునేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఈ ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా 108 అంబులెన్స్ వాహనాన్ని మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ వాహనం ద్వారా మెరుగైన సేవలు అందించాలని ఆయన సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, నరాల శ్రీను, నంద్రు రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి డీఎస్పీ పరామర్శ

మణుగూరుటౌన్: తొగ్గూడెం శివారు ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాల్వంచలో పనిచేస్తున్న కానిస్టేబుల్ అనిల్ మృతి చెందిన నేపథ్యంలో సుందరయ్య నగర్‌లోని బాధిత కుటుంబాన్ని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్‌లు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. డిపార్ట్‌మెంట్ నుంచి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని భార్య, కుటుంబ సభ్యులకు హామీనిచ్చారు. మణుగూరుకు చెందిన అనిల్ పాల్వంచలో విధులు నిర్వహిస్తున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతోనే మృతి చెందడంతో ప్రమాదంపై పూర్తి స్థాయిలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, అన్ని రకాల వివరాలు సేకరించి బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. మణుగూరు ఎస్‌ఐలు మేడ ప్రసాద్, రంజిత్, సిబ్బంది ఉన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో నిర్మాణం పూర్తైన డబుల్‌బెడ్రూం ఇళ్లను శనివారం తహసీల్దార్ శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణంలోని గోదావరి ముంపుకు గురవుతున్న అయ్యప్ప కాలనీ, కొత్త కాలనీవాసులతో పాటు దివ్యాంగులు, కేన్సర్ బాధితులు వంటి మొత్తం 111 లబ్ధిదారులకు లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, ఆర్ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోలులో అక్రమాలు'

దమ్మపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు, పలు అక్రమాలకు పాల్పడుతున్నారని సీపీఎం అనుబంధ రైతు సంఘం జిల్లా నాయకుడు దొడ్డా లక్ష్మీనారాయణ ఆరోపణలు చేశారు. శనివారం మండల కేంద్రంలో సీపీఎం అనుబంధ రైతు సంఘం సమావేశంను నిర్వహించారు. సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఆంధ్ర ప్రాంతం నుండి సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసిన దళారులు, బోనస్ కోసం వాటిని బినామీ పేర్లతో కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారని అన్నారు. రైతుల నుండి అధికంగా ధాన్యాన్ని తరుగుగా తీసి, మిల్లర్లకు లబ్ధిచేకుర్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మోరంపూడి శ్రీనివాసరావు, కొప్పుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని ప్రకటించాలి

చర్ల: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల డీఏలను విడుదల చేసి, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐనంపూడి జపాన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన అన్ని పోస్టులను భర్తీ చేయడంతో పాటు పదోన్నతులు కల్పించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేసి పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎఫ్ మండల అధ్యక్షుడిగా బొడ్డు నాగేశ్వరావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి బి.సైదులు పాల్గొన్నారు.

మాలధారుల పాదయాత్ర

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన 30 మంది హనుమాన్ మాలాదారులు శనివారం స్థానిక రామాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ చంద్ర, గురుస్వామి నాగుల కాంతారావు సమక్షంలో ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మాలధారులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామం నుంచి సుమారు 60 కిలో మీటర్ల దూరంలో ఏపీలోని జంగారెడ్డిగూడెం సమీపంలోగల శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి కాలినడకన తరలివెళ్లారు. భక్తులు సాధు శ్రీను, పానుగంటి చెన్నకేశవులు, నరేష్, శ్రీను, శివ, బాలు, వెంకన్నబాబు, అంజి ఉన్నారు.


బూర్గంపాడు: విద్యార్థులు, తల్లిదండ్రులతో కలసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, పక్కన ఐటీడీఏ పీఓ రాహుల్


నూతన డైట్ మెనూను పరిశీలిస్తున్న మండల అధికారులు


గుండాల: గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న తహసీల్దార్

నూతన డైట్ మెనూ ప్రారంభం

- వసతి గృహాల్లో కొత్తగా భోజనం
- ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో కార్యక్రమాలు
- పకడ్బందీ అమలుకు ఆదేశం


చర్ల: నూతన డైట్ మెనూ చార్ట్‌ను విడుదల చేస్తున్న ట్రైకార్ జీఎం కుంజా శంకర్‌రావు

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని మంగవాయి బాడువలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కొత్త డైట్ మెనూను తెలంగాణా ట్రైకార్ జీఎం కుంజా శంకర్‌రావు శనివారం ప్రారంభించారు. విద్యార్థులకు తొలిరోజు మెనూలో ఏర్పాటు చేసిన భోజన పదార్థాలను ఆయన పరిశీలించారు. మండలంలోని గౌరారం, దుమ్ముగూడెం, లక్ష్మీనగరం, నారాయణరావుపేట, కొత్తపల్లి, రామచంద్రునిపేట గ్రామాల్లోని గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోనూ నూతన డైట్ మెనూను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ మంగమ్మ, ప్రదానోపాధ్యాయురాలు వీరమ్మ, వార్డెన్ నాగేశ్వరరావు ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: డైట్ మెనూ కార్యక్రమాన్ని ఉప్పుసాక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కొత్త డైట్ మెను కచ్చితంగా అమలు చేయాలని, లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌సీసీలో గోల్డ్‌మెడల్ సాధించిన ఉప్పుసాక గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థికి పతకాన్ని అందజేశారు. ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్‌శర్మ, ఎంఈఓ యదు సింహారాజు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే చేతుల మీదుగా, ఆ తర్వాత మండలంలోని సున్నంబట్టి, పెదవాగు ప్రాజెక్టు ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో ఐటీడీఏ పీఓతో కలిసి ఎమ్మెల్యే కొత్త మెనూను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏటీడీఓ చంద్రమోహన్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ సంగీత, హెచ్‌ఎం రాంబాబు, జి.సుశీల, కె.మాధవరెడ్డి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలను మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ తేలూరి శ్రీనివాసరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతిలు శనివారం సందర్శించి నూతన డైట్ మెనూను ప్రారంభించారు. ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, అధికారులు, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ములకలపల్లి: హాస్టళ్ల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచిన నేపథ్యంలో శనివారం ములకలపల్లి గురుకుల పాఠశాలతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కమలాపురం ఆశ్రమ స్కూల్, మండలకేంద్రంలో హాస్టళ్లలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో మండల అధికారులు పాల్గొని, మాట్లాడారు. తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ జి.రేవతితో నూతన మెనూ చార్ట్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

చర్ల: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో డైట్ మెనూను తహసీల్దార్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. సౌకర్యాలను వినియోగించుకుని లక్ష్యాలను చేరుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ పీవీ రమణ, వసతిగృహ సిబ్బంది శ్రీకాంత్, సమ్మయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల కేంద్రంలో బీసీ బాలుర వసతి గృహంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కామన్ డైట్ మెనూను శనివారం ఎంపీఓ ముత్యాలరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ నరసింహారావు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండాల: గిరిజన వసతి గృహాలలో ఆశ్రమ,గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని గుండాల తహసీల్దార్ ఇమ్మానుయేల్ అన్నారు. శనివారం ఆయన గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ప్రభుత్వం ఇటీవల పెంచిన మెనూ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుండాల, ఆళ్లపల్లి ఎంపీడీఓలు సత్యనారాయణ, శ్రీనివాస్, గురుకుల కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎంఈఓ పార్వతమ్మ వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని గిరిజన గురుకులంలో విద్యార్థుల కోసం కొత్తగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలు గతంలో కంటే 40 శాతం పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, సుమలత, తెల్లం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల పరిధిలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలలో ఎంపీడీఓ కుమార్ కొత్త మెనూను ప్రారంభించారు. తహసీల్దార్ నాగ ప్రసాద్, ఎంఈఓ మంజుల, పాఠశాల హెచ్‌ఎం డి.నాగేశ్వరరావు, వార్డెన్ బి.శేఖర్, ఉపాధ్యాయులు గంగరాజు, సాయన్న, రామచంద్ర రావు, లింబ్యా, సత్యనారాయణ, జనార్దన్, సరోజినీ, శ్రీనివాసరావు, బాలరాజు, నాగేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు.


భద్రాచలంటౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు


చర్ల: ఎస్సీ వసతి గృహంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్


ములకలపల్లి: గురుకులంలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ రేవతి


అశ్వాపురం: బీసీ హాస్టల్‌లో కామన్ డైట్ మెనూను ప్రారంభిస్తున్న ఎంపీఓ ముత్యాలరావు

లోక్ అదాలత్‌లో 532 కేసుల పరిష్కారం


భద్రాచలంఅర్బన్: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి శివనాయక్


మణుగూరురూరల్: మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

భద్రాచలంఅర్బన్: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా భద్రాచలం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టుతో పాటు అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టులో శనివారం 532 కేసులు పరిష్కరించినట్లుగా భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ తెలిపారు. శనివారం భద్రాచలం కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు ఉచిత న్యాయం, న్యాయ విజ్ఞానం అందించామన్నారు. లోక్ అదాలత్‌తో చిన్న చిన్న తగాదాలను రాజీచేసుకొని స్నేహ పూర్వక వాతావరణంలో ఉండడమే కాకుండా సివిల్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో 23 కేసులు రాజీ కాగా, 25 కేసులలో జరిమానా, ఒక చెక్‌బౌన్స్ కేసు, 52 బ్యాంక్ ప్రీలిటిగేషన్, 18 టెలిఫోన్, 3 కుటుంబ మెయింటెనెన్స్ కేసులు, 405 డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ చాలన్ల కేసులతోపాటు 05 బెల్టు షాపులకు సంబంధించి కేసులు.. మొత్తంగా శనివారం భద్రాచలం కోర్టులో జరిగిన లోక్ ఆదాలత్‌లో 532 కేసులను పరిష్కరించినట్లుగా ఆయన వివరించారు. అదే విధంగా ఇటీవల భద్రాచలంలో జూదం ఆడుతూ పట్టుబడిన 11 మందికి ట్రైబల్ డిగ్రీ బాయ్స్ హాస్టల్‌లో మూడు గంటల పాటు క్లీన్ అండ్ గ్రీన్ వర్క్ పనులు చేయాల్సిందిగా భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ తీర్పు వెలువరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, కార్యదర్శి పూసల శ్రీనివాస్ చారి, సీనియర్ న్యాయవాదులు నాగరాజు, కొడాలి శ్రీనివాసుల, వెంకటేశ్వర్లు ,సత్యనారాయణ, అరుణ్ చంద్, ఎంవీ.రమణ, మల్లేష్, ప్రకాష్, సాధనపల్లి సతీష్, తిరుమలరావు, అరుణ శ్రీ పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం


మణుగూరురూరల్: రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ ధ్యేయమని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె సూరిరెడ్డి అన్నారు. శనివారం కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ సూరిరెడ్డి మాట్లాడుతూ.. రాజీమార్గమే రాజమార్గమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ ద్వారా సత్వర పరిష్కారం చేయవచ్చన్నారు.లోక్ అదాలత్‌లో 50 నేరం అంగీకరించిన కేసులలో 24 రాజీ కుదర్చడం జరిగిందన్నారు. రెండు మనోవర్తి కేసులు, ఒక గృహహింస, ఒక ఎక్సైజ్, మూడు చెక్ బౌన్స్ కేసులు, 161 పిటీ కేసులకు రాజీ కుదిరిందన్నారు. వీటిలో సీసీ కేసులకు సంబంధించి రూ.1,06,500లు, పిటీ కేసులకు సంబంధించి రూ.1,86,000లు, బ్యాంక్ పీఎల్‌సీ కేసులకు సంబంధించి రూ.26,650, బీఎస్ఎన్ఎల్ పీఎల్‌సీ కేసులకు సంబంధించి రూ.49,376ల చొప్పున జరిమానా విధించి సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిపారు. న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది, కోర్ట్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం

భద్రాచలంఅర్బన్: బండారు చందర్‌రావు 39వ వర్ధంతి సందర్భంగా బండారు చందర్‌రావు (బీసీఆర్) ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు పవన్ కుమార్, రమేష్ చంద్రలు ప్రారంభించి మాట్లాడుతూ.. కరోనా సమయంలో బీసీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో కరోనా ఐసోలేషన్ కేంద్రం నిర్వహించటం, కరోనాతో చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహించటం, గోదారి వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ట్రస్టు కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షత వహించగా, పట్టణానికి చెందిన పలువురు బ్లడ్ ఆర్గనైజర్లు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలు

దమ్మపేట: గిరిజన ప్రాంతంలో రోజంతా ఏలాంటి అనుమతులూ లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి, తరలించిన ఘటన శనివారం మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. దమ్మపేట మండలం మొండివర్రె గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రం నుంచి అక్రమంగా భారీ జేసీబీ యంత్రంతో మట్టి తవ్వకాలు చేశారు. భారీ జేసీబీతో మట్టి తవ్వకాలు చేసి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు మైనింగ్ మాఫీయా యథేచ్ఛగా బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారు. కాగా రోజంతా సాగిన ఈ అక్రమ మట్టి తవ్వకాలు, ట్రాక్టర్లలో రవాణాను పోలీస్, రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోలేదు. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పును రూ.800 నుంచి రూ.1000 విక్రయించినట్లు తెలిసింది. కాగా, ఈ అక్రమ తవ్వకాలు, రవాణా వెనుక కొంతమంది అధికారుల పాత్ర కూడా ఉందనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఆయా అధికారులు అడ్డుకోకపోవడంతో ఈ ఆరోపణలకు బలం చేకూరుతున్నాయి.


వ్యవసాయ క్షేత్రంలో భారీ జేసీబీతో రాత్రుల్లోనూ తవ్వకాలు చేస్తున్న మాఫియా

డిస్కస్‌త్రో పోటీల్లో ఉద్యోగి ప్రతిభ

అశ్వాపురం: భారత అణుశక్తి విభాగం స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్లలో భాగంగా ముంబాయిలో శనివారం జరిగిన అథ్లెటిక్ పోటీల్లో డిస్కస్‌త్రోలో మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగి గౌరవ్ ప్రతాప్‌సింగ్ సోలంకి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. గౌరవ్ ప్రతాప్‌సింగ్ సోలంకిని భారజల కర్మాగారం జీఎం హెచ్‌కే.శర్మ, అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందించారు.

సీపీఐ నాయకుడికి నివాళి

ములకలపల్లి: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తుది శ్వాస వరకూ జీవించిన తాటి తిరుపతయ్య చిరస్మరణీయుడని సీపీఐ నాయకుడు నిమ్మల రాంబాబు అన్నారు. గుర్రాలకుంట సమీపంలోని ధర్మన్ననగర్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందిన తిరుపతయ్య మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. పూలమాల వేసి అంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు రాయబారపు వెంకటేశ్వర్లు, తాటి నాగరాజు, ఈసం అశోక్, బాలరాజు తదితరులు ఉన్నారు.

టీజీఆర్ఎస్ఏ ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

చర్ల: తెలంగాణా రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా దుమ్ముగూడెం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కల్లూరి వెంకటేశ్వరావు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో జరిగిన జిల్లా సమావేశంలో జిల్లా కమిటీ నూతనంగా ఎంపికలు చేపట్టగా.. వెంకటేశ్వరావుకు జిల్లా ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించారు. వెంకటేశ్వరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ ఇచ్చే ప్రతి పిలుపునూ అందుకుని వాటి పరిష్కారానికి పోరాటాలు సాగిస్తానని చెప్పారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

మణుగూరుటౌన్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, రైతు రుణమాఫీ పూర్తి చేసి కొత్త రుణాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. శనివారం శ్రామిక భవనంలో లెనిన్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పూర్తయిందని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాలుగు విడుతలుగా రుణమాఫీలో 50శాతం కూడా జిల్లాలో రుణమాఫీ చేయలేదన్నారు. పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా పేదలకు ఇవ్వాలని సూచించారు. మహిళలకు రూ.2,500, వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12,500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు, కార్యదర్శి వర్గ సభ్యులు పిట్టల నాగమణి, బొల్లం రాజు, తోట పద్మ, కొండ్రుగౌరి కుంజ రాజు భీమయ్య, పల్లపు నాగేశ్వరరావు ఉన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో సమగ్రాభివృద్ధి


సారపాకలో బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: పారిశ్రామిక ప్రాంతమైన సారపాక సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు.సారపాకలో శనివారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రాజీవ్‌నగర్, మహేంద్రకాలనీ, విజయ్‌నగర్ కాలనీ, గాంధీనగర్, పాలకేంద్రం ప్రాంతాల్లో రూ.60లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. సారపాకలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు రూ.20లక్షల నిధులతో ఏర్పాటు చేసిన రెండు 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. సారపాకలో, ముసలిమడుగు గ్రామాలలో ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు ప్రభుత్వం దశలవారీగా నిధులు మంజూరు చేస్తోందన్నారు.అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చేందుకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఉప్పుసాక గ్రామంలో అనిపిడి కుమార్ అనే రైతు సాగు చేస్తున్న మునగ తోటను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించారు. మునగ తోటల సాగుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో ఎకరాకు రూ.1.20లక్షల వరకు రైతులకు ప్రభుత్వం ఆర్థికతోడ్పాటును అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తు రైతులకు ఆర్థికభరోసా కల్పిస్తోందన్నారు. ఎంపీడీఓ జమలారెడ్డి, ఐటీసీ పీఎస్‌పీడీ జనరల్ మేనేజర్ చెంగలరావు, విద్యుత్ శాఖ ఏఈ ఉపేందర్, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, టీపీసీసీ సభ్యులు తాళ్లూరి చక్రవర్తి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి, చల్లా వెంకటనారాయణ, మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బెల్లంకొండ రామారావు, ఇంగువ రమేష్, బర్ల నాగమణి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏజెన్సీ సమస్యల పరిష్కారానికి కృషి

చర్ల: ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణా జన సమితి పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు అన్నారు. శనివారం దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాలకు కూడలిగా ఉన్న చర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం టీజేఎస్ పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు, త్వరలోనే కళాశాల ఏర్పాటుకు ఉత్తర్వులు కూడా వెలువడనున్నట్లు ఆయన చెప్పారు. చర్ల నుంచి అమరావతికి నేషనల్‌హైవే నిర్మించాల్సిన అవసరం ఉందని, దీని కోసం కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి వినతిపత్రం ఇచ్చిమని ఆయన చెప్పారు. వెంకటాపురం మండలంలోని ఆలుబాకను, దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలను ప్రత్యేక మండలాలుగా ప్రకటంటించాలని ఆయన కోరారు. తెలంగాణా వాదానికి ప్రధాన కేంద్రబిందువుగా నిలిచిన పాల్వంచలో ఈ నెల 29న టీజేఎస్ ప్లీనం జరుగనున్నట్లు వారు ప్రకటించారు. తెలంగాణాకు వచ్చి జీవనాన్ని సాగిస్తున్న ఆదివాసీలకు తక్షణమే ఎస్టీ కుల ధ్రువపత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బరగడి దేవదానం, జిల్లా కార్యదర్శి ఎస్‌ఏ రవూఫ్, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేపాక రామారావు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

15న రాష్ట్రస్థాయి సమావేశం

చర్ల: ఈ నెల 15న మణుగూరు పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సమావేశానికి గిరిజనులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐతం బాలు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని లక్ష్మీనగరంలో ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణా రాష్ట్రంలో ఆదివాసీల హక్కులు చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం హరించేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. దొడ్డిదారిన ఏజెన్సీలోకి వచ్చిన గిరిజనేతరులకు సర్వేల పేరుతో ఆదివాసీ చట్టాల్లో హక్కులు కల్పించేందుకు ఈ ప్రభుత్వం చూస్తోందని ఆయన అన్నారు. ఆదివాసీలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని పినపాక, మణుగూరు, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు మండలాల్లో ఇసుక ర్యాంపులను కేటాయిస్తే.. రైజింగ్ కాంట్రాక్టర్ల పేరుతో గిరిజనేతరులు వచ్చి ఆదివాసీల అవకాశాలను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. తక్షణమూ రైజింగ్ కాంట్రాక్టర్ల వ్యవస్థను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్, జాయింట్ సెక్రటరీ సురేష్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు